క్లుప్తంగా

పాఠశాలలో విద్యార్థి నేతల ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ శ్రీ త్రివేణి పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ డేలో భాగంగా విద్యార్థుల ప్రమాణస్వీకారం, నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణస్వీకారం కనుల పండువగా జరిగింది. పాఠశాల హెడ్‌బాయ్‌గా కార్తీక్, హెడ్‌గర్ల్‌గా మనస్వి, స్పోర్ట్స్ కెప్టెన్‌గా విఘ్నేశ్, వైస్ కెప్టెన్లుగా బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సునీల్, హెడ్‌మిస్ట్రెస్ యోగీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

మహేశ్వరం: ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. వైద్య రంగానికి సరిపడ బడ్జెట్ పెంచకుండా, రాష్ట్రాలకు సరిపడ నిధులు విడుదల చేయకుండా అనేక ఇబ్బందులకు బీజేపీ ప్రభుత్వం గురి చేస్తుందన్నారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజు

మీర్‌పేట: రానున్న పండగలు, ఉత్సవాల సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లకు మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. రానున్న బోనాలు, మొహర్రం, గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం రౌడీషీటర్లకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పండగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. సమావేశంలో డీఐ గౌరునాయుడు, ఎస్‌ఐలు సుధాకర్, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

వనస్థలిపురం: వివిధ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం తగిన నిధులు కేటాయించాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నాలా పనులు, స్ట్రీట్ లైట్లు తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాగార్జున కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి, వెంకటరమణ కాలనీ అధ్యక్షుడు నవీన్, యశోదనగర్ కాలనీ అధ్యక్షుడు యాదవరెడ్డి పాల్గొన్నారు.

సురభి నాటకోత్సవాలు ప్రారంభం

వనస్థలిపురం: భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త సహకారంతో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా వినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో నాటకోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వనస్థలిపురం హుడా గ్రౌండ్‌లోని సురభి థియేటర్‌లో ఆరు రోజులు నాటక ప్రదర్శన కొనసాగనుంది. వనస్థలిపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, ఆర్‌టీవో వేణు ముఖ్య అతిథులుగా హాజరై నాటకాన్ని ప్రారంభించారు. మాయాబజార్ నాటకం వీక్షకులను విశేషంగా అలరించింది. బాలనాగమ్మ, శ్రీనివాస కల్యాణం, శ్రీకృష్ణ లీలలు, చింతామణి, పాతాళభైరవి నాటకాలను రోజుకు ఒక్కటి చొప్పున ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు ఆర్.వేణుగోపాల్‌రావు తెలిపారు.

ముందుకు సాగని పనులు..!

- అధ్వాన్నంగా గుర్రంగూడ.. అల్మాస్‌గూడ రోడ్డు
- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- పట్టించుకోని అధికారులు



అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వెళ్లే రోడ్డు

బడంగ్‌పేట్: పేరుకే బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్. ఇది తెలంగాణలో మూడో అతిపెద్దది. అభివృద్ధిలో మాత్రం గ్రామ పంచాయతీల కంటే హీనం. రోడ్లకు, డ్రైనేజీలకు కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తారు. పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే.. అన్నట్లు ఉంటాయి. పాలకుల పర్యటనలు అంతా ఇంతగా ఉండవు. కాలనీ సంఘం నాయకులు, ఎన్నిమార్లు రాజకీయ నాయకుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం శూన్యం. పనుల్లో జాప్యం చేస్తున్నా పట్టించుకునే అధికారులు ఉండరని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. చిన్నపాటి వానలకే గుర్రంగూడలో ప్రధాన రోడ్లు చెరువులు, సరస్సులను తలపిస్తున్నాయి. అల్మాస్‌గూడ టూ గుర్రంగూడ వెళ్లే ప్రధాన రహదారి రాకపోకలకు ఆటంకంగా మారింది. రెండేళ్ల క్రితం రోడ్డు మంజూరు, రోడ్డు విస్తరణకు కలిపి సుమారు రూ.3 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. ఒక దశలో ఎన్నికల హడావిడిలో రోడ్లు మొదలు పెడుతున్నట్లు కంకరవేశారు. ఈ పనులు చేసి ఏడాది కావస్తున్నా పెండింగ్ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పోసిన కంకర సైతం వర్షాలకు, వాహనాల రాకపోకలకు కనమరుగయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలుగా మారి నడవలేని స్థితికి చేరాయి. బైకులు, వాహనాలు అందులో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ దారి పలు ప్రమాదాలకు నిలయంగా మారి ఆందోళన కలిగిస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యటనలకే పరిమితం..

ఇటీవలే మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా రెడ్డి పర్యటించారు. రోడ్ల దుస్థితి చూసి చలించిపోయారు. హెచ్ఎండీఏ నుంచి రూ.250 కోట్లు మంజూరు అయ్యాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. ఆ నిధులు విడుదల కాగానే రోడ్డు పనులు మొదలు పెడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. గుంతలు పడినచోట వెంటనే ప్యాచ్ వర్కులు చేసి ప్రమాదాలు జరుగకుండా సహకరించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఈ విషయంలో స్పందించిన ఎమ్మెల్యే ఎమర్జెన్సీ ఫండ్ కింద నిధులు వెచ్చించి గుంతలు పూడ్చాలని బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. పక్షం రోజులైనా అధికారులు మాత్రం ప్యాచ్ వర్కు పనులు చేయకపోవడం గమనార్హం. ఇరవై రోజుల క్రితం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అల్మాస్‌గూడ టూ గుర్రంగూడ రోడ్డును పరిశీలించారు. వెంటనే పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయినప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే పనులు మొదలు పెట్టాలి...



అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. పేరుకే పెద్ద కార్పొరేషన్. అధికారులు మాత్రం రోడ్ల దుస్థితిని పట్టించుకోరా? ప్రమాదాలు జరుగక ముందే స్పందించాలి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నాం. తక్షణమే పెండింగ్ పనులు మొదలు పెట్టాలి.

– పుట్టగళ్ల సంజీవ, గుర్రంగూడ



ఎమ్మెల్యే సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న యాదగిరి

కార్మికులకు అండగా ఉంటా

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్ కార్మికులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని ఏపీపీఆర్ గార్డెన్‌లో ఎలక్ట్రికల్‌లో అపూర్వ నైపుణ్యం సాధించిన నికోలా టెస్లా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్లకు ఏదైనా ఆపద వస్తే కార్మిక శాఖకు(లేబర్ డిపార్ట్‌మెంట్) వెళ్లే నిధులను ముందుండి ఇప్పిస్తానని అభయమిచ్చారు. ప్రమాదవశాత్తు చనిపోయిన, లేక అంగవైకల్యం ఏర్పడిన డిపార్ట్‌మెంట్‌తో మాట్లాడి నిధులు వచ్చేలా చేస్తానన్నారు. అసోసియేషన్‌కు 150 గజాల స్థలాన్ని బాలాపూర్ మండల పరిధిలో కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ప్రతి ఎలక్ట్రీషియన్ ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డును తీసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్లు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క యాదగిరి, ఎలక్ట్రికల్ మండల అధ్యక్షుడు కాశీనాయుడు, సీనియర్ నాయకులు రఘు, నాయకులు ఏనుగు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, ముత్యాల కృష్ణ, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పాదిల గోవర్ధన్, విట్టల ప్రసాద్, వెంకటేశ్, గోలి గిరి, శ్రీనివాస్, దాసరి గిరి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

మహేశ్వరం: మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం 2024–25 సంవత్సరానికి గాను తైబజార్ వేలం నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాట నిర్వహణకు ముందు డిపాజిట్ కింద గ్రామ పంచాయతీలో డబ్బులు చెల్లించి రశీదు పొందిన అభ్యర్థులు మాత్రమే వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలం పాటలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీలో ఎలాంటి బాకీలు ఉండొద్దన్నారు. పూర్తి వివరాలకు మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

హుడాకాంప్లెక్స్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఎల్‌బీనగర్ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ని మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్‌లోని సమస్యలను వివరించి మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. జీబీ కాలనీలో అప్పటి నాలా పునఃరుద్ధరణ, దెబ్బతిన్న రోడ్డు ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకొని నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. వీటితో పాటు నాలా పూడికలు, పారిశుద్ధ్యం, వీధికుక్కల సమస్యలకు క్రమం తప్పకుండా పరిష్కారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.



ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

మీ భూమి మీకే

దళితులకు హామీ ఇచ్చిన కేఎల్‌ఆర్

బడంగ్‌పేట్: మిగిలి ఉన్న భూమి మీకే అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి బడంగ్‌పేట దళితులకు హామీనిచ్చారు. బుధవారం బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనెంబర్ 2లోని దళితుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారి బాధలు విన్న తర్వాత కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. తాతల నుంచి దున్నుకుంటున్న భూమికి మీరే వారసులన్నారు. మిగిలి ఉన్న భూములు మీకే చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం అభయం ఇస్తుందన్నారు. ఇందులో ఇళ్లు కట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పుట్టగళ్ల జగన్, గుడ్ల శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, చిత్రం శ్రీను, కర్రె రమేశ్, ఉమేశ్, ముత్యాలు, రాములు, భూ బాధితులు ఉన్నారు.



బడంగ్‌పేట దళితులతో మాట్లాడుతున్న కేఎల్‌ఆర్

మొక్కలతోనే మానవ మనుగడ

మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్

మహేశ్వరం: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 1వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో కనీసం 3 నుంచి 5 మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు పెంచడంతో పండ్లు, పూలు, ఔషధాలు, కలప, స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వన మహోత్సవం కార్యక్రమంలో బాధ్యతగా పాల్గొని మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతారని అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎమ్మెల్యే అనివార్య కారణాలతో ఆమె కార్యక్రమం రద్దయింది. దీంతో ఈ కార్యక్రమాన్ని చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామ్, కౌన్సిలర్లు బోధ యాదగిరిరెడ్డి, వై.శివ కుమార్, జాపాల భావన, రాజమోని రాజు, బాకీ విలాస్, పద్మ, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్లు మల్లేశ్, జంగయ్య, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, హౌసింగ్ బోర్డు కాలనీవాసులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న చైర్మన్ కాంటేకార్ మధుమోహన్, తదితరులు

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

మండల పరిధిలోని మహేశ్వరం గేటు సమీపంలో ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ అధికారులు, సిబ్బందికి మొక్కలు ఏవిధంగా నాటి, సంరక్షించాలనే అంశాలపై అటవీ శాఖ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. నర్సరీలో మొక్కలు పెంపకం, మొక్కలు ఏవిధంగా నాటాలి, గుంతలు తీయడం, కర్ర పెట్టి తాడు ఏవిధంగా కట్టాలి, పాదు తీయడం, మొక్కలకు క్రిమిసంహారక మందులు ఏవిధంగా పిచికారి చేయాలనే అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు ఫారెస్టు అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంఖాల్ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రభాకర్, సెక్షన్ అధికారి సరిత, ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ పరిమళ, బీట్ అధికారి చారి, ఈసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధనే లక్ష్యం

జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి వెంకటయ్య



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న వెంకటయ్య

కడ్తాల్: గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనే లక్ష్యమని జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలతో పాటు, గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంట గది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వసతిగృహ విద్యార్థులతో పాటు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, బెడ్‌షీట్స్, కార్పెట్స్, దుస్తులు, నోట్ బుక్స్ పంపిణీకి సంబంధించిన వివరాలను వసతి గృహ సంక్షేమాధికారి రాములును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సకాలంలో హాజరుకావాలని, విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రతపై దృష్టి సారించేలా వారికి ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల ఆవరణలో దోమలు, ఈగల బెడద లేకుండా పాఠశాల, వసతిగృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వృథా నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వసతిగృహ సంక్షేమాధికారి రాములుకు సూచించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

చైతన్యపురి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా చైతన్యపురిలో పెయింటర్స్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని, హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి పూజలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లోని హరిహర పుత్ర ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నిర్మాణంలో ఉండటంతో ఇప్పటికే ప్రధాన ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. దాతలు సహకరించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిచెట్టు అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కడ్తాల్: భారతీయ కిసాన్ సంఘ్ కడ్తాల్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్, తీగల శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున స్వామి, ఉప ప్రధాన కార్యదర్శిగా గూడూరు సురేందర్‌రెడ్డి, కోశాధికారిగా ఇక్బాల్‌పాషా, సహకార్యదర్శిగా మర్లమల్లేశ్, నేనావత్ సూర్యనాయక్, సభ్యులుగా కృష్ణ, శేఖర్, రెడ్యానాయక్ నియమితులయ్యారు.

వీఆర్వోలకు న్యాయం చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: మాతృసంస్థలోకి తీసుకొని వీఆర్వోలకు న్యాయం చేయాలని ఆ సంఘం నేతలు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు శ్రీరాములు, జగదీశ్, దయానంద్, గణేశ్‌లు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను వాడుకొని లాభపడిందని, ఆ తదుపరి వీఆర్వోలు అవినీతి ఆరోపణలకు పాల్పడుతున్నారని, తమను నిర్దాక్షిణ్యంగా తొలగించి ఇతర శాఖల్లోకి తీసుకొని అవమానాలకు గురిచేశారన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సందర్భంలో వీఆర్వోలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి సైట్‌ను ఎత్తివేస్తామని, వీఆర్వోలకు న్యాయం చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేయాలని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు నగేష్, యాదగిరి, దశరథ, జంగయ్య, ముత్యాలు, నర్సింహ్మారెడ్డి, వెంకటేశ్, కృష్ణలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషిచేశారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ మంగ, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్: వర్షకాలం దృష్ట్యా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. దోమల నివారణపై అధికారులు, సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వల్ల వ్యాపించే రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడా నీరు ఎక్కువ రోజులు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు డ్రైడే నిర్వహించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీలు ముకుందారెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, జాకీయ సుల్తాన, సుజాత, జోనల్ శానిటేషన్ ఇన్‌చార్జి సువార్త, సీనియర్ ఎంటమాలజీ రజినీ తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కుట్ర

- ఉద్యోగాల భర్తీపై అసత్య ప్రచారం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలంటూ దళిత, గిరిజన విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యోగ నియామకాలను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మి నిరుద్యోగులు, విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం రూ.17.50 కోట్లతో నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకే ఉద్యోగాలను భర్తీ చేస్తుందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టలేదని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు న్యాయం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. కల్వకుర్తి నియోజక వర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. ఆమనగల్లులో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంతో పాటు డిగ్రీ కళాశాల భవనం, పాలిటెక్నిక్ కళాశాల భవనం నిర్మిస్తామని చెప్పారు. రూ.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి సేకరిస్తున్నట్లు ఆయన వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అనువైన 150 ఎకరాల స్థల పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.రాజు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గీత, వైద్య విధానపరిషత్ డీఈ రవీందర్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మున్సిపల్‌చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, డాక్టర్లు నాగరాజు, పరిక్షిత్‌నరేందర్, జయశ్రీ, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరెడ్డి, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, తహసీల్దార్ లలిత, ప్రభాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వస్పుల జంగయ్య, శెట్టిపల్లి సత్యం, నిట్టి నారాయణ, జగన్, మానయ్య, అప్పం శ్రీను, ఖలీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి